క్లుప్తంగా

50 మంది విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు



విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: మనస్వి చారిటబుల్ ట్రస్ట్, షిర్డీ సాయి సేవాదళ్ విద్యాకమిటీ ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేశారు. వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇంటర్, డిగ్రీ, ఉన్నత విద్య అభ్యసిస్తున్న వారికి రూ. 1.60 లక్షలను ఉపకార వేతనాలుగా అందజేశారు. కార్యక్రమంలో మనస్వి ట్రస్ట్ సభ్యుడు మల్లుల వాసుదేవ్, శీర్ల సత్యనారాయణ, కాళ్ల రత్నాజీ, నాగిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చినబాబుకు బెస్ట్ రీజియన్ ఆఫ్ ది లయన్ అవార్డు



తణుకులో బెస్ట్ రీజియన్ ఆఫ్ ది లయన్ అవార్డు అందుకుంటున్న చినబాబు చౌదరి

కొవ్వూరు: 2022–23 సంవత్సరానికి లయన్స్ క్లబ్ రీజియన్ ఆఫ్ ది లయన్ అవార్డును పట్టణానికి చెందిన పాలెంపాటి చినబాబు చౌదరి, ఫస్ట్ బెస్ట్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ అవార్డును కంఠమణి రామకిషోర్ సొంతం చేసుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణంలో ఆదివారం ఆ క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ పుట్టా విజయశ్రీ చేతుల మీదుగా వారీ అవార్డులను స్వీకరించారు. సెకండ్ బెస్ట్ సెక్రటరీగా గూడపాటి వెంకట్ సత్య శివప్రసాద్, బెస్ట్ కోశాధికారిగా పాకా జయరామ్‌లు ఎన్నికయ్యారు. పెనుమాక జయరాజు, మహ్మద్ హుస్సేన్, యనమదల సుబ్రహ్మణ్యం, కలగర వెంకట్రావు, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తారకరత్న మృతికి సంతాపం

కొవ్వూరు: నటుడు నందమూరి తారకరత్న మృతికి తెలుగుదేశం పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణ ఆదివారం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తారకరత్న చిత్ర పటానికి పట్టణంలో వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తారకరత్న కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని,"సంతాపాన్ని తెలియజేశారు. టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్ పర్సన్ సూరపనేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీల సేవలు అభినందనీయం

ప్రకాశం నగర్: బ్రహ్మకుమారీలు చేస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీటీఆర్‌ఐ రోడ్డులోని భాస్కర్‌నగర్ బ్రహ్మకుమారీల ఆధ్యాత్మిక కేంద్రంలో శివరాత్రి వేడుకల్లో భాగంగా బ్రహ్మకుమారి గీతా మాధురి ఆధ్వర్యంలో త్రిమూర్తి శివజయంతి మహోత్సవం ఘనంగా నిర్వహించారు.

చేతి వృత్తులకు చేదోడుగా..

- జగన్ ప్రభుత్వం బాసట
- నియోజకవర్గంలో 5,187 మందికి లబ్ధి
- మూడేళ్లలో 15.56 కోట్ల ఆర్థిక సాయం
- నిలదొక్కుకుంటున్న చేతి వృత్తుల కుటుంబాలు



చేదోడు పథకంలో మహిళా టైలర్లకు కానూరులో మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు (ఫైల్)

పెరవలి: పూర్వం నుంచీ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, గ్రామీణుల జీవనం కుల వృత్తులపై ఆధారపడ్డాయి. కమ్మరి చేసే ఎడ్ల బండి, కత్తి, కొడవలి రైతులకు పనిముట్లు. రైతులు పండించే పంటలు అన్ని వృత్తుల వారికీ ఆహారం. అలాగే కుమ్మరి చేసే కుండలు గ్రామస్తులందరికీ వంట పాత్రలైతే, నేతన్నలు తమ కళా నైపుణ్యాన్ని జోడించి నేసే వస్త్రాలు ఊరందరికీ దుస్తులు. ఇప్పటికీ పల్లెల్లో కుల వృత్తుల వారిని ఆయా పేర్లతోనే పిలుస్తున్నారంటే కుల వృత్తులు ప్రాధాన్యతను అంచనా వేయవచ్చు. అయితే యాంత్రీకరణ రాకతో కుల వృత్తులు క్రమంగా తమ ఉనికిని కోల్పోతున్నాయి. చాలా మంది కుల వృత్తులను వదిలి ఉద్యోగాలకు, ఇతర రంగాలకు వెళ్లిపోతున్నారు. మరికొందరు పొట్ట చేత పట్టుకుని పట్టణాలు, నగరాలకు వలస పోతున్నారు. అయినప్పటికీ కొందరు తరతరాలుగా చేస్తున్న కుల వృత్తిని వీడలేక ఒడిదుడుకులు ఎదుర్కొంటూనే అవే వృత్తుల్లో కొనసాగుతున్నారు. ఇలాంటి వారిని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంకల్పించింది. చేతి వృత్తుల వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా చేదోడు పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వివిధ చేతి వృత్తుల వారికి ప్రభుత్వం ఏడాదికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తోంది. కుమ్మరి, నాయీ బ్రాహ్మణ, దర్జీ, రజక వంటి వివిధ వృత్తుల్లో కొనసాగిస్తున్న వారికి ఈ పథకం కింద లబ్ధి చేకూరుతోంది. ఆటుపోట్లతో నడుస్తున్న కుల వృత్తుల మనుగడకు ఈ ప్రభుత్వ సాయం ఊపిరి పోస్తోందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో ఎంత మందికి?

నిడదవోలు నియోజకవర్గంలో వివిధ కులవృత్తులు చేసుకుంటున్న వారు వేలల్లో ఉన్నారు. వారిలో అన్ని అర్హతలతో దరఖాస్తు 5,187 మందికి ఏటా రూ.10 వేల చొప్పున ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందుతోంది. నిడదవోలు మండలంలో 1,870 మందికి, పెరవలి మండలంలో 1,733 మందికి, ఉండ్రాజవరం మండలంలో 1,584 మందికి లబ్ధి చేకూరుతోంది. గత మూడేళ్లలో ఈ పథకం కింద నియోజకవర్గంలోని వివిధ కుల వృత్తుల వారికి రూ.15.56 కోట్ల మేర లబ్ధి చేకూరింది. లబ్ధి పొందిన కుటుంబాలు క్రమంగా ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నాయి.

మా జీవితాల్లో వెలుగులు



జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ నిర్ణయంతో మా జీవితాల్లో వెలుగులు నిండాయి. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి బార్బర్ షాపునకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అధికారం చేపట్టాక మాట నిలబెట్టుకుని, మా కడుపులు నింపారు. ఆయన రుణం తీర్చుకోలేనిది. ఈ వృతిని కొనసాగించలేక ఇప్పటికే ఎందరో వివిధ పనులకు మళ్లిపోయారు. ఈ పథకంతో నాయీ బ్రాహ్మణులకు పూర్వ వైభవం వస్తుంది.

– కవితా శ్రీనివాస్, నాయీ బ్రాహ్మణుడు, కానూరు

ఆకలి తీర్చిన నాయకుడు



నేను బాల్యం నుంచీ క్షురక వృత్తిలో ఉన్నాను. ఆదాయం అంతంత మాత్రం. అయినప్పటికీ ఆ వృత్తిలోనే కొనసాగుతూ కుటుంబాన్ని పడుతూ లేస్తూ నెట్టుకొస్తున్నాను. మాలాంటి వారిని ఇప్పటి వరకూ పట్టించుకున్న పాలకులే లేరు. ఇప్పుడు మమ్మల్ని గుర్తించి, మా కడుపు నింపడానికి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆర్థిక సాయం సంతోషదాయకం. ఆయనకు రుణపడి ఉంటాం.

– తుమ్మలపల్లి మాధవరావు, కానూరు అగ్రహారం

చేతి వృత్తులకు చేయూత



నేను వాయిద్య కారుడ్ని. శుభకార్యాలు ఉన్నపుడు ఆర్థిక ఇబ్బందులు ఉండవు. ఆషాఢం వంటి శూన్య మాసాల్లో ఉపాధికి కష్టమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో చేదోడు పథకం మా కుటుంబాన్ని ఆదుకుంటోంది. ప్రభుత్వం సాయం మా వృత్తికి కొంతమేర పెట్టుబడిగా ఉపయోగ పడుతోంది. గతంలో కంటే మా కుటుంబ పరిస్థితి మెరుగుపడింది.

– టి అప్పారావు, నడుపల్లి

నా అదృష్టం



అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే చేదోడు పథకాన్ని అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిది. పేదలు, కులవృత్తుల వారి పట్ల ఈ ప్రభుత్వానికి ఎంత గౌరవం ఉందో చెప్పడానికి చేదోడు పథకమే ఒక నిదర్శనం. దేశంలో ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానిదే. ఇలాంటి ప్రభుత్వంలో సభ్యుడిని కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

– జి శ్రీనివాస్ నాయుడు, ఎమ్మెల్యే, నిడదవోలు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



అగ్ని ప్రమాద బాధితురాలికి ఆర్థిక సాయం అందిస్తున్న ఆనంద్ స్వరూప్ తదితరులు

నల్లజర్ల: మండలంలోని పోతవరం శివారు కృష్ణాయిగూడెంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన జొన్నకూటి గంగ కుటుంబానికి చీపురుగూడేనికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ వసంతాడ ఆనంద్ స్వరూప్ బాసటగా నిలిచారు. తన మిత్రులైన ప్రత్తిపాటి మురళి, అబ్బులు, వెంకటేశ్వరరావు, చిన్నారావు, గొల్ల రత్నదీపిక, పూసల సురేష్‌లతో కలసి ఆదివారం ఆయన రూ.12 వేల ఆర్థిక సాయం అందించారు.

ఎంప్లాయిస్ ఫెడరేషన్..

సామాజిక మాధ్యమాల ద్వారా అగ్ని ప్రమాద వార్త తెలుసుకున్న చాగల్లు మండల ఎంప్లాయిస్ ఫెడరేషన్ బాధిత కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందించింది. ఫెడరేషన్ సభ్యులు కొడమంచిలి సత్యనారాయణ, గెల్లా రాజు, బొల్లిపో మధుశేఖర్, మెరుపో జలమయ్య తదితరులు ఆర్థిక సాయం అందించిన వారిలో ఉన్నారు.

22 నుంచి బాలయేసు ఉత్సవాలు

గోపాలపురం: మండలంలోని దొండపూడి గ్రామంలోని బాలయేసు పుణ్యక్షేత్ర మహోత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి జరుగుతాయని ఆ పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ అలెక్స్, ఫాదర్ జోబిన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జరిగే మహోత్సవాలకు ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరాజు హాజరవుతారని చెప్పారు.

శివలింగ దర్శనం.. ఎంత భాగ్యం



అన్నవరప్పాడులో స్ఫటిక లింగాన్ని దర్శించుకుంటున్న భక్తులు



స్ఫటిక లింగ దర్శనానికి జాతీయ రహదారిపై క్యూలో ఉన్న భక్తులు

పెరవలి: అన్నవరప్పాడు విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని స్ఫటిక లింగ దర్శనానికి రెండో రోజైన ఆదివారం కూడా భక్తులు పోటెత్తారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచే కాకుండా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. ఊహించిన దానికంటే భక్తుల తాకిడి ఎక్కువగా ఉండడంతో ఆలయ నిర్వాహకులు, పోలీసులు ఇబ్బందులు పడ్డారు. జాతీయ రహదారిపై సుమారు కిలోమీటరు పొడవునా భక్తులు క్యూలైన్‌లో గంటల తరబడి వేచి ఉన్నారు. తెల్లవారు జాము నాలుగు గంటలకు ప్రారంభమైన దర్శనాలు రాత్రి వరకూ కొనసాగాయి. ఆదివారం కావడంతో ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

ఛత్రపతి శివాజీకి ఘనంగా నివాళి



తాళ్లపూడిలో ఛత్రపతి శివాజీకి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: ఓటమి ఎరుగని మరాఠా యోధుడు, హిందూ ధర్మ పరిరక్షణకు విశేషంగా పాటుపడిన ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని ఆదివారం తాళ్లపూడిలో నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బొర్రా శ్రీరామచంద్రమూర్తి శివాజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం యూత్ ఆధ్వర్యంలో మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ యూత్ పాల్గొన్నారు.

గోపాలపురంలో..

గోపాలపురం: ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక వైఎస్సార్ జంక్షన్ వద్ద శివాజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నేటి యువత శివాజీని ఆదర్శంగా తీసుకుని ఆయన ధైర్య సాహసాలను అలవరుచుకోవాలని బీహెచ్ఎస్ఆర్ అండ్ వీఎల్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో నాయకులు గెల్లా శ్రీనుబాబు, కొండేపాటి రత్నాజీ, శాంతా రమేష్, బొడ్డు వీరరాఘవులు, ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నదిలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

కొవ్వూరు: మండలంలోని మద్దూరులంక సమీపంలో గోదావరి నదిలో గల్లంతైన దేవరకొండ శ్రీరామ్ (19) అనే యువకుడు విగత జీవుడయ్యాడు. అతడి మృతదేహం ఆదివారం ఉదయం నదిలో లభ్యమైనట్టు కొవ్వూరు రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు. చాగల్లు మండలం చంద్రవరానికి చెందిన శ్రీరామ్, మల్లవరానికి చెందిన ఎస్‌కే బషీర్, మలకా ధనరాజు స్నేహితులు. ఈ ముగ్గురూ శుక్రవారం ఉదయం మద్దూరులంక గోదావరి బ్రిడ్జి వద్దకి వచ్చారు. బహిర్భూమికి వెళ్లి వస్తానని శ్రీరామ్ స్నేహితులతో చెప్పి బ్రిడ్జి దిగువకు వెళ్లాడు. కొద్ది సేపటికే అతడు గోదావరిలో గల్లంతయ్యాడు. అప్పటి నుంచీ నదిలో గాలించగా ఆదివారం అతడి మృతదేహం లభ్యమైనట్టు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించామని తెలిపారు. శ్రీరామ్ తల్లి మార్తమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్సై సతీష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఏసీ మెకానిక్ మృతి

తాళ్లపూడి: కొవ్వూరు మండలం, చిడిపి గ్రామ శివార్లలోని మలుపు వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనుకు చెందిన అడ్డగర్ల సురేష్ (30) అనే ఏసీ మెకానిక్ దుర్మరణం చెందాడు. తాళ్లపూడిలో ఏసీ వర్క్ పూర్తి చేసుకున్న సురేష్ తన మిత్రుడైన ఆడబాల సురేష్‌తో కలసి బైక్‌పై తిరిగి వెళుతున్నాడు. ఘటనా స్థలానికి వచ్చేసరికి కొవ్వూరు వైపు నుంచి వస్తున్న కారు వారిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అడ్డగర్ల సురేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన ఆడబాల సురేష్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు అడ్డగర్ల కిషోర్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తాళ్లపూడి ఎస్సై వెంకటరమణ తెలిపారు.

రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక

ప్రకాశం నగర్ : విశాఖపట్నంలో ఈ నెల 20, 21, 22 తేదీల్లో జరగబోయే రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు రాజమహేంద్రవరం గాంధీపార్కులో శిక్షణ తీసుకున్న విద్యార్థులు జితేంద్ర కుమార స్వామి, అనిరుధ్, కెల్లా భవ్యశ్రీ ఎంపికైనట్లు కోచ్ రాము ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ..



కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

- వేగేశ్వరపురంలో పూర్వ విద్యార్థుల భేటీ

తాళ్లపూడి: వేగేశ్వరపురంలోని కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1980 నుంచి 1990 వరకూ ఈ హైస్కూల్లో చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కోలాహలంగా సాగింది. మూడు దశాబ్దాల క్రితం పక్కపక్కనే కూర్చుని చదువుకున్న మిత్రులందరూ ఒకేచోట చేరారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని,యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల రోజుల్లోని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సాయంత్రం వరకూ ఉల్లాసంగా గడిపారు. పాఠశాలకు రూ.10 వేల విలువైన మైక్, స్పీకర్‌ను విరాళంగా అందజేశారు. అనంతరం నాటి తమ గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వేగేశ్వరపురం, బల్లిపాడు గ్రామాల సర్పంచులు కొమ్మిరెడ్డి పరశురామారావు, ఎల్లిన శివ, పూర్వ విద్యార్థులు సూర్యనారాయణ, శీర్ల సత్యనారాయణ, డి చక్రపాణి, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వం.. శాంతి కల్యాణం



హోమ క్రతువు నిర్వహిస్తున్న లక్ష్మీనరసింహ గురూజీ



ఒకే వేదికపై ఐదుగురు దేవతామూర్తులకు జరుగుతున్న శాంతి కల్యాణం

- ఒకే వేదికపై ఐదుగురు దేవతామూర్తుల కల్యాణం
- సుందరగిరిపై ముగిసిన మహాయజ్ఞం

ద్వారకాతిరుమల: ఎక్కడా చూడని విధంగా ఒకే వేదికపై ఐదుగురు దేవతామూర్తులకు వారి దేవేరులతో ఆదివారం ఉదయం సుందరగిరిపై శాంతి కల్యాణం మహోత్సవం జరిగింది. మృత్యుంజయ సంపుటిత సుదర్శన నృసింహ ధన్వంతరి 28వ మహాయజ్ఞం ముగింపును పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుక భక్తులకు నేత్ర పర్వమైంది. ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమై ఐఎస్.జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన లక్ష్మీనరసింహుని ఆలయ ప్రాంగణములో ఏర్పాటు చేసిన వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత నరసింహ స్వామివారికి, శివ పార్వతులకు, లక్ష్మీనారాయణులకు, మరో ఇద్దరు దేవతామూర్తులకు అంగరంగ వైభవంగా కల్యాణం జరిపారు. రుత్వికులు, పండితులు శాస్త్రోక్తంగా ఈ కల్యాణ తంతు జరిపించారు. శనివారం సాయంత్రం ప్రారంభమైన మహాయజ్ఞంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈ యజ్ఞం ఆదివారం తెల్లవారుజామున జరిగిన మహాపూర్ణాహుతితో ముగిసింది. అనంతరం రుత్వికులు, పండితులు సాలి గ్రామాలను అభిషేకించారు. మంగళకర శాంతి మంత్రాలతో రుద్రం, రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. అందులో అభిషేక జలంగా కలశ ప్రతిష్ఠలో ఉంచిన మంత్రపు జలాన్ని, కొబ్బరి నీరు వినియోగించారు. కల్యాణ తంతు అనంతరం సుమారు 50 రకాల పండ్లు, ఫలహారాలు, స్వీట్లు, ఇతర పిండి వంటకాలను నైవేద్యంగా సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన కొచ్చెర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురూజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలను సీహెచ్ కుటుంబరావు పర్యవేక్షించారు.

ఉండ్రాజవరంలో ఏకాదశ రుద్రాభిషేకం

ఉండ్రాజవరం: స్థానిక బాలాత్రిపుర సుందరీ, గోకర్ణేశ్వర స్వామి వారికి శనివారం రాత్రి 11 గంటలకు లింగోద్భవ కాలంలో ఏకాదశ రుద్రాభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు. చంద్రశేఖర సరస్వతి స్వామి సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వామివారికి 11 రకాల ద్రవ్యాలతో అభిషేకం, సహస్రనామ బిల్వ పత్ర పూజ చేశారు. బాలా త్రిపుర సుందరీ దేవి అమ్మవారికి లలితా సహస్ర నామ కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రశేఖర సరస్వతి సేవా సమితి సభ్యులు ఆకెళ్ల శ్రీనివాసరావు, దోనేపూడి సుధాకర్, ఈ.సత్యకృష్ణ, కె.సత్యనారాయణ, కె.గోపాలకృష్ణ, దోనేపూడి శ్రీరామ్‌పవన్ తదితరులు పాల్గొన్నారు.

సురభికి జాతీయ సౌరభం

- భారత్ రంగ్ మహోత్సవంలో మెరిసిన ఏకైక తెలుగు నాటకం భక్త ప్రహ్లాద



భక్త ప్రహ్లాద నాటకంలో ఒక సన్నివేశం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సురభి అంటేనే నాటకం... నాటకం అంటేనే సురభి అన్నంతగా పేరు సంపాదించుకుంది సురభి కుటుంబం. అందుకే నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్ఎస్‌డీ) ఆధ్వర్యంలో భారత్ రంగ్ మహోత్సవంలో ప్రదర్శనకు వారి నాటకం ఎంపికైంది. రాజమహేంద్రవరంలోని శ్రీవేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో ఆదివారం నుంచి జరుగుతున్న థియేటర్ ఫెస్టివల్‌లో శ్రీ వెంకటేశ్వర సురభి థియేటర్ గ్రూప్ హైదరాబాద్ వారు భక్త ప్రహ్లాద నాటకాన్ని ప్రదర్శించారు.

నాలుగు వేల నాటకాలు వడపోత...

ఎన్ఎస్‌డీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జాతీయ స్థాయి నాటక ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఈ ఏడాది రాజమహేంద్రవరంలో నిర్వహణకు ఎన్ఎస్‌డీ సుముఖత తెలపడంతో ఆదివారం నుంచి 23వ తేదీ వరకు వివిధ రాష్ట్రాల కళాకారుల నాటకాలు ప్రదర్శించనున్నారు. దేశవ్యాప్తంగా నాలుగు వేల నాటకాలను ఎన్ఎస్‌డీ బృందం పరిశీలించి వాటిలో ఉత్తమంగా ఉన్న వాటిని ఎంపిక చేస్తుంది. ఇప్పటి వరకు సురభి కళాకారులు తప్ప మరే ఇతర నాటక కంపెనీకి ఇటువంటి అవకాశం దక్కలేదు. తెలుగు వారి నాటకాలను సుమారు రెండువేల వరకు పరిశీలించి వాటిలో సురభి వారికి అవకాశం కల్పించారు.

ఇతర రాష్ట్రాల కళాకారులతో పోటీ ఎక్కువ

మన నాటకాలలో భావోద్వేగాలకు ప్రాధాన్యం ఇస్తాం. ఇతర రాష్ట్రాల నాటకాలలో లైటింగ్, టెక్నికల్ అంశాలకు ప్రాధాన్యం ఇస్తారు. అందుకే వారితో తెలుగు నాటకం పోటీ పడలేకపోతోంది.

అలరించిన భక్త ప్రహ్లాద

సురభి జయచంద్ర దర్శకత్వంలో ప్రదర్శించిన భక్తప్రహ్లాద నాటకం వీక్షకులను అలరించింది. సెట్టింగ్‌లు, లైటింగ్, మ్యూజిక్‌తో నాటకాన్ని రక్తి కట్టించారు. నాటకం చూస్తున్నంత సేపు ప్రేక్షకులు వేరే లోకంలో విహరించారు. దర్శకుడిగానే కాకుండా హిరణ్యకశిపుడిగా నటించి సురభి జయచంద్ర మెప్పించారు. ప్రహ్లాదుడి పాత్రలో నటించిన పర్ణిక (ఆరు సంవత్సరాలు) 102 జ్వరంతో ఉన్నా తన నటనతో మంత్రముగ్ధులను చేసింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ డ్రామా అఫైర్స్ సంచాలకులు అభిలాస్ పిళ్లై, బెంగళూర్ ఎన్ఎస్‌డీ సెంటర్ డైరెక్టర్ వీణా శర్మ, ఏపీ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మల్లికార్జునరావు, రాజమహేంద్రవరం సెంటర్ ఇన్‌చార్జి భూపతి, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, డిప్యూటీ డీఈఓ దిలీప్‌కుమార్, విజయశంకర ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఐదువేల నాటకాలు ప్రదర్శించాను



సురభి వారసుడిగా నేను ఇప్పటి వరకు ఐదు వేల నాటకాలకు పైగా ప్రదర్శనలు ఇచ్చాను. భారత్‌రంగ్ మహోత్సవాలలో మూడుసార్లు ప్రదర్శనలు ఇచ్చాను. ఏ తెలుగు నాటకం కూడా ఇప్పటి వరకు భారత్ రంగ్ మహోత్సవానికి ఎంపిక కాలేదు. ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ కేంద్ర సంగీత నాటక అవార్డును 2016లో అందుకున్నాను.

– సురభి జయచంద్ర వర్మ, దర్శకుడు, కళాకారుడు

చిన్నప్పటి నుంచీ నటిస్తున్నా



నేను నాలుగోయేట నుంచే నాటకాలలో నటిస్తున్నాను. ఇప్పటి వరకు 200 ప్రదర్శనలు ఇచ్చాను. ప్రహ్లాదుడిగా చాలాసార్లు నటించాను. మా నాన్న, అమ్మ, అందరూ నాకు రోజూ పద్యాలు నేర్పిస్తారు. మేకప్ వేసుకుంటే నాలో తెలియని ఉత్సాహం వస్తుంది.

– ఆర్.పర్ణిక వర్మ, ప్రహ్లాద పాత్రధారిణి

సద్గుణాలు ఉన్నవారే ఉత్తములు

జమాతే ఇస్లామి హింద్ సమావేశం



జమాతే ఇస్లామి హింద్ సమావేశంలో పాల్గొన్న ముస్లింలు

నల్లజర్ల: మంచి నడవడిక, ఉత్తమ గుణాలు కలిగిన వారే ఉత్తములని జమాతే ఇస్లామి హింద్ నల్లజర్ల శాఖ అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ షరీఫ్ అన్నారు. ×మానవత–నైతికత। పై రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న అవగాహన ఉద్యమంలో భాగంగా ఆదివారం నల్లజర్లలో ఎస్ఎం ఆలీ సాహెబ్ ఇంటివద్ద ఆధ్యాత్మిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ మానవత, నైతికతలు వ్యక్తి స్వభావంలోనివే అని వాటి ద్వారానే ఉత్తమ సమాజ స్థాపన సాధ్యపడుతుందన్నారు. తద్వారా సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. ధర్మం అంటే పరుల మేలును, శ్రేయస్సును మంచిని కోరుకోవడమే అన్నారు. సమావేశంలో ఎస్‌కే సుభానీ, ఎస్‌కే అజీజ్, ఎస్‌కే రఫీ, అంజాద్ ఆలీ, రిటైర్డు ఉపాధ్యాయులు మోహనరావు, గోగులమండ రాజారావు తదితరులు పాల్గొన్నారు.